# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

❖ పట్టణ ప్రాంతాల పేదలకు జాతీయ ఉపాధి హామీ పధకాన్ని వర్తింపజేసే ఆలోచన ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు.

❖ పోలవరం ప్రాజెక్టు దస్త్రాలను తగుల బెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

❖ ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" కార్యక్రమం 113వ సంచిక ఈనెల 25న ప్రసారమవుతుంది.

==========================

ఉపాధి హామీ పధకాన్ని పట్టణ పేదలకు కూడా అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి హామీ ఇచ్చారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈ రోజు మంత్రిని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా బృందం కలసి ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ.. వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పట్టణాలకు వలసలు పెరిగాయని, మురికివాడల్లో ఉన్న పేదలకు ఉపాధి హామీ చట్టాన్ని విస్తరించడం ద్వారా పేదలకు మేలు జరుగుతుందని తెలిపారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని పట్టణాల్లో పేదలకు ఉపాధి హామీ చట్టం అమలు జరుగుతున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. వాటిని పరిశీలించి రాష్ట్రంలో అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తామని అన్నారు. అదే విధంగా ఈ నెల 23వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించి ఏడాది పాటు ఉపాధి హామీ ద్వారా చేసే పనులు నిర్ణయిస్తామని మంత్రి వెల్లడించారు.

==========================

పోలవరం ఎడమ కాలువ ప్రాజెక్టు కార్యాలయంలో దస్త్రాలు తగలబెట్టిన ఘటనలో బాధ్యులైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి  కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం ఎడమ కాలువ భూసేకరణ ప్రాజెక్టు కార్యాలయాన్ని రోజు మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పారదర్శక పాలన అందించాలనే సంకల్పంతో ఉందన్నారు. అవినీతి విషయంలో ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 37 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రం అనేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఒకటవ తేదీన సామాజిక  పెన్షన్లతో పాటు  ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఈ రోజు పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం కాంబోట్లపాలెం  గ్రామంలో  14 లక్షల 60  వేల రూపాయలతో అంతర్గత సి.సి. రహదారుల పనులకు  మంత్రి  శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే 16 వేల టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీని ప్రకటించామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 113వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్' కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 23వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుమలలో శ్రీవెంకటేశ్వర స్వామి దర్శనానికి నవంబర్ నెల కోటాకు సంబందించిన ఆర్జిత సేవా టికెట్లను రేపు ఉదయం 10 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎల్రక్టానిక్ డిప్ కోసం ఈ నెల 21 ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారిలో ఈ నెల 21 నుంచి 23 మధ్యాహ్నం 12 గంటల్లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి.

కాగా, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లతో పాటు నవంబరు నెల 9న శ్రీవారి ఆలయంలో నిర్వహించనున్న పుష్పయాగం సేవ టికెట్లను ఈ నెల 22వ తేదీ  ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారని అధికారులు వెల్లడించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉమ్మడి కర్నూల్ జిల్లా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు తక్కువ స్థాయిలో  వరద ప్రవాహం కొనసాగుతుంది. దీంతో  రెండు గేట్లను ఆరు అడుగుల మేర పైకి ఎత్తి 19 వేల 880 క్యూసెక్కుల నీటిని దిగువకు జలవనరుల శాఖ అధికారులు ఈ రోజు విడుదల చేశారు. ఇన్ ఫ్లో 66 వేల 329 క్యూసెక్కులు కాగా  ఔట్ ఫ్లో 66 వేల 329 క్యూసెక్కులుగా ఉందని పేర్కొన్నారు. శ్రీశైలంలో ప్రస్తుత నీటి మట్టం 590 అడుగులు కాగా పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులుగా అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిల్వ 312.45 టీఎంసీలుగా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉపరితల ఆవర్తనం తెలంగాణ మీదుగా కొనసాగుతోందని, అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆగ్నేయ అరేబియా సముద్రం మీదుగా కేరళ  వైపుగా సగటు సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని వాతావరణ అధికారి తెలియజేస్తూ....

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని గొరాడ, ఆర్ జమ్ము, కొండబరిడి, వలసబల్లేరు గ్రామాల్లో ఈరోజు కలెక్టర్ పర్యటించి రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న తీరును గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... సహజ వ్యవసాయం వల్ల పంటలకు అదనపు విలువ పెరుగుతుందని అన్నారు.  సహజ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రజలు మంచి ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రకృతి సోయగాలకు, సహజసిద్ధమైన అందాలకు విశాఖపట్నం చిరునామాగా నిలుస్తుందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె. మహేశ్వరి పేర్కొన్నారు. ప్రస్తుతం విశాఖ పర్యటనలో  ఉన్న ఆయన ఈ  రోజు కుటుంబ సభ్యులతో కలిసి కైలాసగిరి, తెలుగు మ్యూజియంను సందర్శించారు. కైలాసగిరి కొండపై నుంచి విశాఖ వీక్షణం చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... 4 రోజుల విశాఖ పర్యటనలో  ఎన్నో సుందర ప్రదేశాలను సందర్శించానని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమరావతిలో 2027లో జాతీయ క్రీడలు నిర్వహించేందుకు కృషి చేస్తామని విజయవాడ లోక్ సభ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. విజయవాడలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... మంగళగిరిలోని క్రికెట్ స్టేడియాన్ని 6 నెలల వ్యవధిలో ప్రారంభిస్తామన్నారు. విజయవాడలో క్రికెట్ అకాడమీ స్థాపనకు కృషి చేస్తామని తెలిపారు.  కాగా, కేశినేని శివనాథ్ ఆంధ్రా క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా ఇటీవల  ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి గ్రీన్ ఎనర్జీ ఛాంపియన్ అవార్డు లభించింది. ఇండియన్ విండ్ పవర్ అసోసియేషన్ 2023-24 సంవత్సరానికి గ్రీన్ ఎనర్జీ ఛాంపియన్ గా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =